కల్లూర్‌లో పశువైద్య శిబిరం

కోటగిరి, జనవరి 27 : పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేయగా.. సర్పంచ్ వోలే లక్ష్మీ లింగప్ప ప్రారంభించారు. డాక్టర్ సురేశ్‌కుమార్ ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 12 పశువులకు గర్భ నిర్ధారణ, 10 పశువులకు గర్భకోశ చికిత్స, 35 పశువులకు సాధారణ చికిత్స, 40 దూడలకు నట్టల నివారణ మందులను వేశామని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, జూనియర్ డాక్టర్లు రాజేందర్, ప్రకాశ్, అభిషేక్, సిబ్బంది మంజుల, సుధీర్‌గౌడ్, గోపాలమిత్రలు నగేశ్, రియాజ్, తుకారం, సాయిలు పాల్గొన్నారు.

పిల్లలకు న్యుమోనియా నిర్ధారణ పరీక్షలు

కోటగిరిలో సర్వేను పరిశీలిస్తున్న ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్

కోటగిరి, జనవరి 27 : ఐదేండ్లలోపు పిల్లలకు న్యుమోనియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని పొతంగల్ ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ అన్నారు. కోటగిరిలోని పలు కాలనీల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు శనివారం చేస్తున్న న్యుమోనియా నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. ఈ పరీక్షలు వచ్చే నెల 29వ తేదీ వరకు కొనసాగుతాయని, వైద్యసిబ్బంది సర్వే చేపడతారని తెలిపారు. ఇప్పటివరకు 8,235 మంది పిల్లలకు పరీక్షలు చేశారని తెలిపారు. న్యుమోనియా లక్షణాలు ఉన్న 16 మంది చిన్నారులకు ప్రాథమిక చికిత్స ద్వారా నయం చేశామని తెలిపారు. ఏఎన్‌ఎంలు మంజుల, రోజా పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

ధర్పల్లి, జనవరి 27 : మండలకేంద్రంలోని పద్మశాలీ సంఘంలో శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాము నారాయణ, ఉపాధ్యక్షుడిగా దువ్వ భూమేశ్వర్, కార్యదర్శిగా క్యాదరి నారాయణ, కోశాధికారిగా డాక్టర్ అంకం ఆనంద్, గౌరవ అధ్యక్షుడిగా జక్కుల గంగాధర్, సభ్యులుగా స్వామి, విష్ణు, శంకర్, రవి, నవీన్, పురుషోత్తం, రవి, మహేందర్, తిరుపతిని ఎన్నుకున్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ క్రీడాకారిణి

జక్రాన్‌పల్లి, జనవరి 27 : మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన ఆకుల భవ్యశ్రీ అండర్-19 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సర్పంచ్ చేతనా విజయ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లాలోని నెహ్రూ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారిణిని ఉపసర్పంచ్ నాయికి రాజు, ఎంపీటీసీ జయా గిరిధర్‌గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, గ్రామకమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, గ్రామస్తులు శనివారం అభినందించారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

సిరికొండ, జనవరి 27 : పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి బాబూరావు సూచించారు. మండలంలోని 21 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యానం రాజారెడ్డి, వీడీసీ చైర్మన్, వెటర్నరీ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి యాదవరావుకు సన్మానం

యాదవరావును సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ఖిల్లీవాడి/ సుభాష్‌నగర్, జనవరి 27 : ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కందుకుర్తి యాదవరావును నగరంలోని ఆయన నివాసంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం -ఇందూరు అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. సాహిత్యంలో ఆయనకు జాతీయ పురస్కారం వచ్చినందుకు సన్మానించినట్లు వారు తెలిపారు. యాదవరావు తెలుగు, మరాఠీ, హిందీ భాషల్లో సుమారు 700కు పైగా చరిత్ర పరిశోధనలు చేసి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. యాదవరావు ఇంట్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యుడు రొట్టె సురేశ్‌శర్మ, ఉదయ్, పురుషోత్తం, లక్ష్మీనారాయణ, రమేశ్, చంద్రశేఖర్, గుండేరావు, మల్లికార్జున్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

కంఠేశ్వర్, జనవరి 27 : బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 'బేటీ బచావో – బేటీ పఢావో' నినాదంతో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణలో బాలికలదే పైచేయిగా నిలుస్తున్నదని తెలిపారు.

ప్రతిఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, చదువుతోనూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని సూచించారు. బాలికలపై తల్లిదండ్రులు వివక్షను ప్రదర్శించకుండా, వారికి ఉన్నత విద్యాభ్యాసం దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం చదువుకున్న వారందరూ ప్రైవేట్‌లో సైతం భారీ వేతనంతో ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా బాలికల ప్రాధాన్యతను చాటుతూ విద్యార్థినులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థినులకు సైకిళ్లతోపాటు వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అంతకుముందు విద్యార్థినులు ర్యాలీ నిర్వహించగా.. అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ జయరాం, డీడబ్ల్యూవో రసూల్‌బీ, డీఈవో దుర్గాప్రసాద్, జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్, మైనార్టీ సంక్షేమాధికారిణి కృష్ణవేణి, జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో జైలుకు కానిస్టేబుల్

■ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ

వినాయక్‌నగర్, జనవరి 27 : ఓ మైనర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదు కాగా.. ఆయనను శనివారం జైలుకు పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ మహేశ్‌బాబు తనతో అసభ్యకరంగా వ్యవహరించాడని ఓ మైనర్ బాలిక మూడు రోజుల క్రితం రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. సదరు పోలీసు కానిస్టేబుల్‌పై గురువారం రోజు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రోజు విధులకు వచ్చిన సదరు కానిస్టేబుల్.. తనపై కేసు నమోదైన విషయం తోటి సిబ్బంది ద్వారా తెలియడంతో ఠాణా నుంచి పరారయ్యాడు. ఈ విషయం సీపీ దృష్టికి వెళ్లడంతో సీరియస్‌గా పరిగణించారు. సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణ పర్యవేక్షణలో పరారీలో ఉన్న మహేశ్‌బాబును సిబ్బంది పట్టుకున్నారు. కానిస్టేబుల్‌ను పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి ముందు శనివారం హాజరుపర్చగా.. నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కానిస్టేబుల్‌ను రూరల్ సిబ్బంది జిల్లా జైలుకు తరలించారు. సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. నాలుగు నెలల క్రితమే సస్పెండ్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన మహేశ్‌బాబు.. మళ్లీ ఏకంగా పోక్సో కేసులో నిందితుడిగా నిలవడంతో ప్రిలిమినరీ విచారణ జరిపేందుకు ఓ అధికారిని నియమించినట్లు తెలిసింది. విచారణ నివేదిక ఆధారంగా కానిస్టేబుల్‌పై సీపీ సస్పెన్షన్ వేటు వేయనున్నట్లు సమాచారం.

జిల్లా జైలులో లోక్ అదాలత్

• 13 క్రిమినల్ కేసుల పరిష్కారం

వినాయక్‌నగర్, జనవరి 27: నిజామాబాద్ జిల్లా జైలులో కామారెడ్డి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. జిల్లా కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఆయన.. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఖైదీల వివరాలు, వారిపై నమోదైన కేసుల వివరాలను జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ ఉపేందర్‌రావు, రాజశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బాన్సువాడ, బిచ్కుంద, కామారెడ్డి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణలో ఉన్న 13 కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించి, వాటిని కొట్టివేస్తూ అవార్డులను జారీ చేశారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

సంతోష్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్, జనవరి27: వ్యాపారంలో నష్టాలు భరించలేక పట్టణానికి చెందిన ధన్‌పాల్ సంతోష్(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన సంతోష్ కుమార్ పాత బస్టాండ్ వద్ద పలు కంపెనీలకు చెందిన ఏజెన్సీలు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 24వ తేదీన పని నిమిత్తం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 26వ తేదీన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులకు శనివారం ఉదయం పట్టణ శివారులోని గుండ్ల చెరువులో సంతోష్ కుమార్ మృతదేహం లభ్యమైంది. వ్యాపారంలో నష్టాలు, ఆర్థిక ఇబ్బందులో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

కొత్త మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఆర్మూర్‌టౌన్, జనవరి27: కొత్త మున్సిపల్ చైర్మన్‌ను వెంటనే ఎన్నుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కౌన్సిలర్ రంగన్న మాట్లాడుతూ జనవరి 4వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిందన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పండిత్ వినితాపవన్ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని అన్నారు. ప్రజలు వారిని నమ్మే స్థితుల్లో లేరని, చైర్మన్ పదవీ కాలం గడువు సంవత్సరం వరకు ఉందన్నారు. వైస్ చైర్మన్ మున్నాను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించాలని, లేదంటే వెంటనే కొత్త చైర్మన్‌ను నియమించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్నా, రమేశ్, అయ్యప్ప శీను, రాము, గంగా మోహన్ చక్రు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

మాక్లూర్, జనవరి 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకురాలు ఈశ్వరి డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన ఐఎఫ్‌టీయూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారిణి ప్రగతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకురాలు మాట్లాడుతూ కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యం కల్పించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో డిమాండ్ల సాధన కోసం పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది మోతీ, రమా, శారద, విజయమ్మ, చంద్రకళ, నిర్మల, సావిత్రి, అండాలు, సాయమ్మ, తోయాబా పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి27: కేజీబీవీలో పని చేస్తున్న బోధనేతర సిబ్బందితో పాటు వర్కర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కేజీబీవీ నాట్ టీచింగ్ అండర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పెర్మిట్ కేజీబీవీ ఎదుట డిమాండ్లతో కూడిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది సుమలత, శోభ, రాధ, విక్టోరియా, అనిత, రూప, సునీత, లక్ష్మి, జయమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

'రెచ్చగొట్టే ప్రచారం మానుకోండి'

మాట్లాడుతున్న ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్

ఎడపల్లి, జనవరి 27 : తనపై అవిశ్వాసం పెడతామంటూ రెచ్చగొట్టేలా కొందరు ప్రచారాలు చేస్తున్నారని, ఇది సిగ్గుచేటని ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 11 మంది ఎంపీటీసీలు ఐక్యంగా ఉంటూ మండలానికి సేవ లందిస్తున్నామని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తాను ఎంపీపీగా ఎన్నికయ్యాయనని, ఎప్పుడూ వారి మాట జవదాటలేదని అన్నారు. కొందరు అసత్య ప్రచారాలు చేస్తూ ఇదిగో అదిగో అవిశ్వాసం అంటూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికీ తాము ఐక్యంగానే ఉన్నామని, ఎవరెన్ని కుట్రలు పన్నినా ఒరిగేదేమీలేదని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, ఎంపీటీసీలు బాబా, నాయుడు స్రవంతి పోతన్న, మనీషా రెడ్డి, పద్మా ముత్తన్న, వననా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టూ టౌన్ ఎస్సై హెడ్‌క్వార్టర్‌కు అటాచ్

వినాయక్‌నగర్, జనవరి 27 : నిజామాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై అశోక్‌ను హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసు విషయంలో సీపీ స్వయంగా పలు సూచనలు చేసినప్పటికీ, విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో ఆయనను హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై-2 మనోజ్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని సీపీ సూచించారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

చందూర్, జనవరి 27 : మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శివ నాగేశ్వర్‌రావు, గుర్తి వేంకటేశ్వర్‌రావు, మాదరపు రాంరెడ్డి, ప్యారం అశోక్, జయరాం, సాయిలు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం వాయిదా

డిచ్‌పల్లి, జనవరి 27 : డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న అలియాస్ శ్రీనివాస్‌పై మండల ప్రాదేశిక సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తూ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు తీర్మాన కాపీని అందజేశారు. ఈనెల 29న ఎంపీపీ గద్దె శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మానం జరగాల్సి ఉండగా.. వాయిదా వేసినట్లు ఆర్డీవో రాజేంద్రకుమార్ ద్వారా లేఖ అందిందని ఎంపీడీవో గోపీబాబు తెలిపారు. అవిశ్వాస తీర్మానం ఎప్పుడనేది త్వరలో ప్రకటిస్తామని, మండల ప్రాదేశిక సభ్యులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

టీయూ అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించాలి

డిచ్‌పల్లి, జనవరి 27 : టీయూ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్ల నిధులను కేటాయించాలని పీడీఎస్‌యూ యూనివర్సిటీ నాయకులు మోహిత్, రవీందర్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌లో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. టీయూలో విద్యార్థినులకు హాస్టల్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆడిటోరియం, నూతన హాస్టల్స్ నిర్మించాలని, స్పోర్ట్స్‌కు మినీ స్టేడియం నిర్మించి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

టీయూ పరిధిలో కొనసాగుతున్న పరీక్షలు

డిచ్‌పల్లి, జనవరి 27 : టీయూ పరిధిలో బీఏ 3, 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. టీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాల, దక్షిణ ప్రాంగణం, గిరిరాజ్ డిగ్రీ కళాశాల, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,699 అభ్యర్థులకు 1,609 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 181 మందికి 180 అభ్యర్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

సిరికొండ, జనవరి 27 : మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. అంతకుముందు సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు, సైన్స్ టాలెంట్ టెస్ట్ తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి సతీశ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

మోర్తాడ్, జనవరి27: తమను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారులు శనివారం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం రూ.20 వేల పింఛన్, ఇంటిస్థలం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దశరత్, గంగాధర్, నర్సయ్య, రాకేశ్, బాబూరావు, రాజన్న, అశోక్, ముత్తెన్న, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాలు రాయడంలో నైపుణ్యం పెంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి27: విద్యార్థులు ఉత్తరాలు రాయడంలో నైపుణ్యాలు పెంచుకోవాలని మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం హరిత సూచించారు. శనివారం సమస్యలపై ప్రభుత్వాలకు లేఖలు రాసి పోస్ట్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాయించి పోస్ట్ చేయించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక

భీమ్‌గల్, జనవరి 27: మండలంలోని మెండోరా జడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థులు గణేశ్, సాయికుమార్ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో లైఫ్ సేవింగ్ జాకెట్ తయారుచేసి ప్రదర్శించారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గైడ్ టీచర్ల గంగా మోహన్, విద్యార్థులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, వీడీసీ చైర్మన్ గంగారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు బీడీ దాస్‌కు డాక్టరేట్

భవంతి దేవిదాస్

నవీపేట, జనవరి 27: పేదలకు వివిధ రకాల సేవలను అందిస్తున్న మండల కేంద్రానికి చెందిన భవంతి దేవిదాస్(బీడీ దాస్)కు అరుదైన గౌరవం దక్కింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్స్ యూనివర్సిటీ శనివారం తమిళనాడులోని మైసూర్ పట్టణంలో పొలిటికల్ అండ్ సోషల్ సర్వీసెస్ సంబంధించి భవంతి దేవిదాస్ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లీవాడి, జనవరి 27: జిల్లాకేంద్రంలోని పలు డివిజన్లలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీ తోట రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎల్లమ్మగుట్ట, ఖిల్లీవాడి, గాంధీచౌక్, పూసలగల్లీ, రైల్వేస్టేషన్, సరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

శక్కర్‌నగర్, జనవరి 27: బోధన్- నిజామాబాద్ రహదారిపై ఆటోనగర్ వద్ద శనివారం బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ప్యాసింజర్ ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందారు. నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. మహారాష్ట్రలోని లోడేగాంకు చెందిన మారుతీ (20) తన సోదరి, ఆమె కుమార్తెను ఆర్మూర్‌లోని అత్తగారింటి వద్ద వదిలిపెట్టేందుకు వెళ్తున్నారు. బైక్ అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో డ్రైవర్, వర్నికి చెందిన ఇద్దరు, లోడేగాంకు చెందిన మారుతీ, అతని సోదరి, ఆమె కుమార్తె మొత్తం ఆరుగురు ఉన్నారు. వీరిలో మారుతీ మృతి చెందాడు. గాయాలైన వారిని 108లో బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

సయ్యద్ షా జమాల్ ఖాద్రీ దర్గా ఉర్సు ప్రారంభం

ఉత్సవాల ప్రారంభానికి హాజరైన ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, పట్టణ సీఐ వీరయ్య, ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు

శక్కర్‌నగర్, జనవరి 27: బోధన్ పట్టణం రాకాసీపేట్‌లోని భీమునిగుట్ట వద్ద ఉన్న సయ్యద్ షా జమాల్ ఖాద్రీ దర్గాలో ఉర్సును ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి బోధన్ ఏసీపీ కేఎం కిరణ్ కుమార్, పట్టణ సీఐ వీరయ్యతో పాటు ఉర్సు ఉత్సవ కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు. ఉత్సవాల సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ వివరించారు. కార్యక్రమంలో ముత్తావలి అళ్ళు, ఉర్సు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● బోధన్, జనవరి 27: బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఈనెల 29న ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి నూతనంగా వచ్చిన 'లహరి' బస్సులకు ప్రారంభిస్తారని డీఎం శ్రీనివాస్ శనివారం తెలిపారు.

● మాక్లూర్, జనవరి27: విజయ్‌రూరల్ ఇంజినీరింగ్ కళశాలలో శనివారం పేట్రియోటిక్ రన్(దేశభక్తి పరుగు) నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాలల చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు.ప్రిన్సిపాల్ గణేశ్, శ్రీకాంత్, స్వప్న, హెచ్‌వోడీలు, విద్యార్థులు, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

● బాల్కొండ, జనవరి 27: బోదేపల్లికి చెందిన గడ్డం సాయన్న మృతదేహం శనివారం మోర్తాడ్ శివారులోని వరద కాలువలో లభ్యమైందని ఎస్సై గోపి తెలిపారు. సాయన్న గురువారం వరదకాలువలో ఓ రైతులకు చెందిన వ్యవసాయ మోటరు వైరును నీటితో నుంచి తీసేందుకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే.. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

● కమ్మర్‌పల్లి, జనవరి 27 : కోనసముందర్ గ్రామశివారులో పేకాటాడుతున్న కోనసముందర్ గ్